క్లుప్తంగా

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

మంత్రి పార్థసారథి



ముసునూరు: ఇటీవల మండలంలో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం పరామర్శించారు. మండలంలోని గోపవరానికి చెందిన గుడ్డేటి మనోహర్, సూరేపల్లికి చెందిన ఓబిళ్లనేని లక్ష్మీనారాయణ, ముల్లంగి పుల్లయ్య, బోట్ల జగన్నాథం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం స్థానిక పార్టీ నేతలతో కలిసి, రెండు గ్రామాల్లోని నాలుగు కుటుంబాల వారిని పరామర్శించి, అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పండ్ల కొట్టు సెంటర్, వెంకటేశ్వరస్వామి కోవెల, కుమ్మరిపేట, అజరయ్యపేట, ధంధం గార్డెన్, అమెరికన్ ఆస్పత్రి ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

జెడ్పీ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీ సీటు



కందుల శివపార్వతి

పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం పుల్లూరు గ్రామంలోని చిలుకూరువారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కందుల శివపార్వతి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివపార్వతిని హెచ్ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలో నిర్మిస్తున్న దాసాంజనేయస్వామి ఆలయానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. సారేపల్లి సురేష్‌కుమార్ రూ.55,555, దోసపాటి ప్రభాకరరావు రూ.5,116 విరాళాలను ఆలయ అర్చకులు మరింగంటి రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులుకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని నిర్మాణ కమిటీ విజ్ఞప్తి చేసింది.

ట్రా'ఫికర్'

- పెరుగుతున్న వాహనాలు
- ఆక్రమణల్లో రోడ్ల మార్జిన్లు
- నూజివీడులో ఇప్పటికీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేని వైనం
- పట్టణంలో తీవ్రమవుతున్న ట్రాఫిక్ కష్టాలు



సింగ్ హోటల్ సెంటర్‌లో ట్రాఫిక్‌తో నిలిచిన వాహనాలు



హనుమాన్ జంక్షన్ రోడ్డులో ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు

నూజివీడు: రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు.. అధికమవుతున్న ప్రజల రాకపోకలు.. కుచించుకుపోతున్న పట్టణంలోని రోడ్లు.. పట్టించుకోని పోలీసులు.. వెరసి నూజివీడును ట్రాఫిక్ కష్టాలు వీడటం లేదు. పట్టణ ప్రణాళికా విభాగం కానీ, పోలీస్ శాఖ కానీ ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని రోడ్లపై ఆటోలను, కార్లను, ఇతర వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలపడం, రోడ్ల మార్జిన్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వంటి చర్యలతో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు.

నాలుగు నెలలుగా ఇక్కట్లు

ఎన్నికల ముందు వరకు ట్రాఫిక్ ఎస్ఐతో పాటు నలుగురు సిబ్బంది ఉండటంతో గతంలో ట్రాఫిక్ కష్టాలు పెద్దగా ఉండేవి కావు. గత నాలుగు నెలలుగా ట్రాఫిక్‌ను పర్యవేక్షించే నాథుడే లేకపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికీ ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సైతం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చిన్న గాంధీ బొమ్మ సెంటర్, జంక్షన్ రోడ్డు, శ్రీనివాస సెంటర్, మున్సిపల్ కార్యాలయం సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, సింగ్‌హోటల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. వన్‌వేలను యథేచ్ఛగా ఉల్లంఘించడం, చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో నాలుగు వైపులా నడిరోడ్డుపై ఆటోలను నిలిపి ఉంచడం, ఆర్టీసీ బస్సులను ఎక్కడబడితే అక్కడ నిలిపి ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం వంటివి పట్టణంలో నిత్యకృత్యమైంది. అంతేగాకుండా డ్రెయినేజీలపై ఎవరికి వారు ఆక్రమణలకు పాల్పడి వ్యాపారాలు చేసుకోవడం, కొందరైతే రోడ్డు వరకు ఆక్రమించుకోవడం తదితర కారణాలతో బస్సులు కానీ, లారీలు కానీ ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

ట్రాఫిక్ జాం క్లియర్‌కు పావు గంట పడుతుంది

పట్టణంలోని సింగ్‌హోటల్ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడితే అక్కడ ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలంటే దాదాపు పావు గంట సేపు కంటే ఎక్కువగానే పడుతోంది. ఈ సెంటర్లలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి రెండు గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఈ సమయంలో స్కూల్ వ్యాన్‌లు, కాలేజీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, బస్సులు, ఆటోలు, కార్లు, లారీల రద్దీ విపరీతంగా ఉంటుంది. ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తితే దానిని క్లియర్ చేయడానికి 15 నిమిషాలకుపైగానే పడుతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియమాలను పాటించేలా వాహనదారులను చైతన్యపరచాలని, ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బురదమయంగా ఈదులగూడెం రోడ్డు

ఆగిరిపల్లి: ఈదులగూడెంలోని ప్రధాన రహదారి, గుంటలు, బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్ర, శనివారం కురిసిన కొద్దిపాటి వర్షానికి ఈదులగూడెంలోని ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరడంతో రహదారి బురదమయంగా మారి రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాదచారులు అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నారు. ద్విచక్ర వాహనాలు జారి కింద పడిపోడి పలువురు గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి గుంటలను పూడ్చి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన ఈదులగూడెంలోని ప్రధాన రహదారి

కట్టెలేరులో పెరిగిన వరద ఉధృతి



కట్టెలేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

గంపలగూడెం: మండలంలోని కట్టెలేరులో వరద ఉధృతి ఆదివారం మరింత పెరిగింది. తోటమూల-వినగడప గ్రామాల నడుమ ధ్వంసమైన వంతెన వద్ద డైవర్షన్ రహదారిపై వరద నీరు పారుతోంది. వరద కారణంగా ఏటిపై రాకపోకలను అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. ఏటి అవతల గ్రామాలైన కనుమూరు, అనుముల్లంక, వినగడప, లంబాడీతండా, నారికింపాడు, కొత్తపల్లి, తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి గంపలగూడెంకు రాకపోకలు జరుగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో తిరువూరు మండలం చింతలపాడు మీదుగా తిరిగి వచ్చేందుకు ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కట్టెలేరులో వరద ఉధృతిని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, గంపలగూడెం ఎస్ఐ ఎస్. శ్రీను పరిశీలించారు. వరద కారణంగా ఎవ్వరూ ఏటివైపు వెళ్లకుండా ఇరువైపులా పోలీసులు కాపలా కాస్తున్నారు.

లయన్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పసుమర్తి వెంకటేశ్వరరావు, నాగుబండి శ్యామసుందర్, కోశాధికారిగా చింతల వెంకటరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. పూర్వపు మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్లు లింగం శివశంకర్, నివృతరావు, గద్దె శేషగిరి, దారా కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు ఆర్థికసాయం అందించారు. త్వరలో పర్యావరణ పరిరక్షణ, మధుమేహ రోగుల వైద్య శిబిరాలు, అనాథలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని తొలి కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. లయన్స్ సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, సంకురాత్రి జనార్దనరావు, అడుసుమల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గంజా కృష్ణమోహన్, బొడ్డు ప్రకాశరావు పాల్గొన్నారు.



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్లు

దూప దీప పథకం వర్తింపజేయాలి

తిరువూరు: అన్ని దేవాలయాలకూ దూప దీప పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ ప్రైవేట్ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక గౌరీ కేదారేశ్వరాలయంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అర్చక పురోహిత సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర విజయకుమార్ రాజు మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించడంతో పాటు గతంలో ఉన్న అన్ని పథకాలనూ అర్హులందరికీ వర్తింపజేయాలని కోరారు. అర్చక పురోహితులకు గుర్తింపు కార్డులు, ఉచిత బీమా పథకాలను కూడా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ సభ్యులు సీతారామలింగేశ్వరశర్మ, అప్పయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం ప్రార్థనలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని జల్ జలాలే సాహెబ్ పంజాలో మొహర్రం ప్రార్థనలు కొనసాగుతున్నాయి. కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో ముస్లిం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పీర్ల వద్ద భక్తులు నిత్య ప్రార్థనలు చేస్తున్నారు. మొహర్రం రోజుల్లో అతి ముఖ్యమైన తొమ్మిదో రోజు సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నామని ముస్లిం పెద్దలు తెలిపారు. త్యాగాలకు ప్రతీకగా భావించే పీర్లను పూజిస్తే దోషాలు తొలగి శుభాలు కలుగుతాయని ముస్లింలు విశ్వసిస్తారు. మొహర్రం రోజుల్లో అగ్నిగుండాలు తొక్కి ఆనాటి మహాత్ముల త్యాగాలను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోందని మత పెద్దలు తెలిపారు.



కొండపల్లిలోని జల్ జలాలే సాహెబ్ పంజాలో అలంకరించిన పీర్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979–81 ఇంటర్మీడియెట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని కనకం రెసిడెన్సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న, ఉద్యోగ విరమణ చేసిన వారు, పలు వృత్తుల్లో ఉన్నవారు అపూర్వ సమ్మేళనానికి హాజరై తమ అనుభూతులను పంచుకున్నారు. కళాశాలలో చదివినప్పుడు స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. 40 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు గుర్తుపట్టలేక ఇబ్బంది పడ్డారు. ఏటా ఒకసారైనా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడంతో పాటు పూర్వ విద్యార్థుల సంఘం తరఫున సామాజిక ప్రయోజన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమ కన్వీనర్ జొన్నాడ రంగారావు, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు సగ్గుర్తి శ్రీనివాసరావు, మచ్చా శ్రీనివాస్, గద్దె వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, కొండా రాజ్‌కుమార్, మిట్టపల్లి రంగనాథగుప్తా, షేక్ సర్దార్, గుర్రం మోహన్‌రావు, కందుల నాగు, నాళ్లా కిషోర్, బి. శ్రీను, ఎం. కేశవరెడ్డి, పిచ్చిరెడ్డి, గజ్జల వెంకటరామయ్య, ఉయ్యూరు అనసూయ, కంచి మాధురి, మేరీ, దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్లోక పఠన శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ రామకృష్ణాపురంలో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన శ్లోక పఠన శిక్షణ తరగతులు జరిగాయి. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూర్యాష్టకం, భగవద్గీత 5వ అధ్యాయం, నవగ్రహ స్తోత్రం తదితర అంశాలను నేర్పించారు. అలాగే హిందూ ధర్మం గురించి, వాటిని ఆచరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థి దశ నుంచే భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా శ్లోకాలు నేర్చుకున్నారు.

జీపీఎస్ గెజిట్ ప్రతులు దహనం

నూజివీడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందేనని యూటీఎఫ్ ఏలూరు జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జీపీఎస్‌పై జీఓను జారీ చేసి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని నిరసిస్తూ పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆదివారం గెజిట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకురావాలని చూసినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగడంతో అమలు చేయకుండా నిలిపివేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం పాత తేదీతో జీఓను జారీ చేయడం దారుణమన్నారు. జీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలందరూ హామీ ఇచ్చారని చెప్పారు. జీపీఎస్‌ను రద్దు చేస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని, కానీ వారి ఆశలపై నీళ్లు చల్లడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీపీఎస్ గెజిట్‌ను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, యూటీఎఫ్ ముసునూరు మండల అధ్యక్షులు జి. పద్మకిషోర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, నాయకులు ప్రభాకర్‌రావు, నాగరాజు, శ్రీనివాసరావు, రమేష్, జాకబ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సమితి కార్యదర్శిగా కుమారి



తిరువూరు: జాతీయ బీసీ చైతన్య సమితి మహిళా విభాగం కార్యదర్శిగా తిరువూరుకు చెందిన సుతారి వెంకట కుమారి నియమితులయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరమణ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. వెనుకబడిన తరగతుల్లో చైతన్యం తీసుకురావడానికి తమ సమితి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని రమణ తెలిపారు. మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులైన వెంకట కుమారిని పలువురు అభినందించారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలకు జీవనశైలి వ్యాధులైన రక్తపోటు, మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ఫ్యామిలీ ఆస్పత్రి ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను అన్నారు. జీవనశైలి వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఆయా శిబిరాల్లో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రక్తపోటు, మధుమేహం ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు రెగ్యులర్‌గా వ్యాయామం, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా శిబిరాల్లో పాల్గొన్న వారికి బీపీ, షుగర్, సీబీపీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆంధ్రప్రభ కాలనీలోని బొమ్మరిల్లు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 186 మందికి, ఎంబీవీకే స్టేడియం వద్ద శిబిరంలో 219 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాలను ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షించగా, స్థానికులు రమేష్, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అప్రమత్తంగా ఉండండి

ముసునూరు: ఇటీవలి కాలంలో పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు, వైర్ల చోరీలు అధికంగా జరుగుతున్నందున విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ హేమసుందర కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులు, విద్యుత్ వినియోగదారులు నష్టపోకుండా ఉండేలా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల వద్ద రాత్రీ, పగలు కాపలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ అందరి బాధ్యతగా గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

మహమ్మద్ ఇక్బాల్ సేవలు ప్రశంసనీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్‌కు మహమ్మద్ ఇక్బాల్ అందించిన సేవలు ప్రశంసనీయమైనవని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్ మూడు నెలల కిందట పదవీ విరమణ చేయగా, ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, పురుషోత్తమచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ ఎన్జీవోస్ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని సంఘ బలోపేతానికి ఇక్బాల్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

అమ్మకు బంగారు బోనం

బెజవాడ దుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. తొలుత బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలో రావిచెట్టు వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, జోగినీలు, కళాకారులు నృత్య ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం, పూజా సామగ్రిని సమర్పించారు. పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













